

పీసెట్‌కు 356 మంది హాజరు

ఏఎన్‌యూ : ఏపీ పీసెట్–2023 పరీక్షలకు గురువారం 356 మంది హాజరయ్యారని సెట్ కన్వీనర్ ఏఎన్‌యూ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ తెలిపారు.



పోలీసులకు టోపీల పంపిణీ

తాడేపల్లిరూరల్ : వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం ట్రాఫిక్ పోలీసులకు టోపీలు అందజేశారు.



ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

పెదకూరపాడు: అమరావతి నదీ పరివాహక ప్రాంతాల్లో సొన్నపు ఘాట్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు అమరావతి సీఐ బ్రహ్మం తెలిపారు.

‘యంత్ర’ముగ్ధం

ఇంకా తొలకరి జల్లు పలకరించకున్నా.. పుడమితల్లి పులకించేలా.. జననేత వరాల జల్లు కురుస్తోంది. అదును ఆరంభం కాకున్నా.. కర్షక సోదరులు పరవశించేలా.. కొండంత భరోసా అందుతోంది. ముందస్తు కన్నా.. ముందే శుభమస్తు అంటూ సేద్య సంరంభానికి సంక్షేమ హారతి పడుతోంది. తొలకరి దుక్కులకు దిక్కులు చూడకుండా నిత్యకృషీవలులు ‘యంత్ర’ముగ్ధమయ్యేలా వెన్నుతట్టి ప్రోత్సహిస్తోంది. ఫలితంగా వ్యవసాయం సంబరమవుతోంది. జై కిసాన్.. జై జగన్ అంటూ నినదిస్తోంది.

వైఎస్సార్ యంత్రసేవకు వేళాయె..!

- నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా గుంటూరులో పంపిణీ
- జిల్లాలో 152 గ్రూపులకు ప్రయోజనం
- 100 ట్రాక్టర్లు, 3 హార్వెస్టర్లు అందజేత



జనా'కర్షక పాలన' : రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన ట్రాక్టర్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఆధునిక సాంకేతికతను జోడించి వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసి అన్నదాతలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. దీనికోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగా యాంత్రీకరణకు పెద్దపీట వేస్తోంది. రైతులకు ట్రాక్టర్లు, కంబైంట్ హార్వెస్టర్లతోపాటు ఇతర యంత్ర పరికరాలను అందిస్తోంది. క్షేత్రస్థాయిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను ఏర్పాటుచేసి తద్వారా రైతులకు సేవలు అందిస్తోంది. ఈ పథకం ద్వారా 2022–23 ఏడాదికి బాపట్ల జిల్లాలోని 152 రైతు గ్రూపులకు 100 ట్రాక్టర్లు, 3 కంబైంట్ హార్వెస్టర్లను శుక్రవారం గుంటూరులో జరగనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేయనున్నారు. వీటి మొత్తం విలువ రూ.12.5 కోట్లు కాగా రూ.4.3 కోట్ల రాయితీతో అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా గతేడాది జిల్లాలోని 263 రైతు గ్రూపులకు 166 ట్రాక్టర్లు, 3 కంబైంట్ హార్వెస్టర్లు అందజేశారు. వీటి విలువ రూ.23 కోట్లు కాగా 8.3 కోట్లు సబ్సిడీతో అందించారు.

పథకం ద్వారా లబ్ధి పొందాలంటే..

ఐదుగురు రైతులతో కూడిన గ్రూపు యంత్రాల కోసం స్థానిక ఆర్‌బీకేలో దరఖాస్తు చేయాలి. యూనిట్ విలువలో 10 శాతం మొత్తాన్ని సదరు గ్రూపు తమ వాటాగా చెల్లించాలి. మిగిలిన 50 శాతం మొత్తాన్ని సహకార బ్యాంకు ద్వారా ప్రభుత్వం రుణం అందిస్తుంది. యూనిట్ ధరలో 40 శాతం మొత్తాన్ని ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందజేస్తుంది. ఈ మొత్తాన్ని లబ్ధిదారుల గ్రూపునకు చెందిన బ్యాంకు ఖాతాలో జమచేస్తుంది. రైతుల గ్రూపులకు ప్రభుత్వం అందజేసిన ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాలను స్థానిక కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లలో ఉంచి అవసరమైన వారు బాడుగ చెల్లించి వినియోగించుకోవచ్చు.

రైతులకు మేలు



ప్రభుత్వం వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా ఏటా రైతులకు ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాలను అందజేస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 152 గ్రూపులకు 100 ట్రాక్టర్లతోపాటు ఇతర యంత్రాలు అందనున్నాయి. 12.5 కోట్లు విలువైన ఈ యంత్రాలను 4.3 కోట్ల సబ్సిడీతో అందజేస్తోంది. యంత్రపరికరాలను రైతులందరూ బాడుగ చెల్లించి వ్యవసాయ పనులకు ఉపయోగించుకోవచ్చు.

– అబ్దుల్ సత్తార్, జేడీఏ, బాపట్ల జిల్లా



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేత డొక్కా మాణిక్యవరప్రసాద్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ తదితరులు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పూర్తి

గుంటూరు వెస్ట్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను గురువారం ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురామ్, రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, అర్బన్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, శాసన మండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవర ప్రసాద్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, జిల్లా అధికారులు పరిశీలించారు. ట్రాఫిక్‌తోపాటు రైతులకు అందజేయనున్న ట్రాక్టర్లు, హార్వెస్టర్లను క్రమపద్ధతిలో ఉంచి వాటిని ముఖ్యమంత్రి చేతులమీదుగా అందించే ఏర్పాట్లపై దృష్టి సారించారు. మొత్తం పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా, ఏలూరు, ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల లబ్ధిదారులు, రైతులు భారీ సంఖ్యలో రానున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రైతుల అభివృద్ధి కోసం చేస్తున్న ఈ మహాయాగంలో తాము పాత్రధారులమైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, వర్షం వచ్చినా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

నేడు మంగళగిరికి విశాఖ శారదా పీఠాధిపతులు

మంగళగిరి: స్థానిక శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ కల్యాణ పుష్కరిణి(పెదకోనేరు) పనులు పరిశీలించేందుకు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందస్వామి, స్వాత్మానందేంద్రస్వామి రానున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. వీరి రాక సందర్భంగా చేసే ఏర్పాట్లను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ఆయన అధికారులు, అర్చకులతో గురువారం ఆలయంలోని ఈఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ పురాతన పెదకోనేరును పరిశీలించేందుకు వస్తున్న పీఠాధిపతులకు అన్ని సౌకర్యాలూ కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమావేశంలో నగర కమిషనర్ యు.శారదాదేవి, ఈఓ ఎ.రామకోటిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు దివి పద్మనాభచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

నిత్యా సం‘గ్రామాలు’

మత్స్యకార గ్రామాల్లో ప్రశాంతత కరువు

- తరచూ రేగుతున్న చిచ్చు
- పోలీసుల పహారాలో తీరప్రాంత పల్లెలు
- ఘర్షణల్లో పోలీసులకూ తీవ్రగాయాలు
- పెద్దలు, ఉన్నతాధికారులు శాంతి చర్చలు జరిపినా మళ్లీ మామూలే
- మూఢనమ్మకాలు, దురాచారాలే కారణం!



కఠారివారిపాలెం 32 గ్రామ పెద్ద కాపులు సమావేశం (ఫైల్)

చీరాల: ఆ తీరప్రాంత గ్రామాల్లో అడుగుపెడితే పోలీసుల తనిఖీలు, పహారాలు తారసపడతాయి. ఇదేదో ఒకనెల రెండు నెలలు కాదు కొన్నేళ్లపాటు ఉద్రిక్త పరిస్థితులు, యుద్ధ వాతావరణం నెలకొంటాయి. అయితే గతంలో పరిస్థితి భిన్నంగా ఉండేది. వారిదంతా సమైక్య జీవనం, గ్రామ పెద్ద కాపులు చెప్పిందే శాసనం. పోలీసుల చట్టాలు వారికి అతీతం. అంతా కలసికట్టుగా అన్నదమ్ముల్లా ఉండేవారు. గత ప్రభుత్వ హయాం నుంచి పరిస్థితి మారింది. వివాదాల కారణంగా ప్రశాంత పల్లెలు నిత్య రణరంగాల్లా మారుతున్నాయి. ఈ గొడవలకు ప్రధాన కారణం మూఢ నమ్మకాలు, దురాచారాలు, కట్టుబాట్లు, (దురాయి) జరిమానాలు, గ్రామ బహిష్కరణలు కొనసాగడమేనని అధికారులు చెబుతున్నారు. బాపట్ల నుంచి నెల్లూరు వరకు గల మత్స్యకార గ్రామాలకు చెందిన పెద్దకాపులు ఎన్నిమార్లు ఈ గ్రామాల్లో రాజీలు కుదిర్చినా, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కలెక్టర్, ఎస్పీ స్థాయి అధికారులు స్వయంగా గ్రామాల్లో పర్యటించి శాంతి చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది.



కఠారివారిపాలెంలో పోలీస్ పికెట్ (ఫైల్)

మూఢనమ్మకాలతో రగిలిన చిచ్చు..

రామపురంలో ఆరు నెలల కిందట ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ఆకస్మాత్తుగా మరణించారు. వీరి మరణంపై అనుమానంతో గ్రామస్తులు చెన్నైకి చెందిన ఒక తాంత్రికుడు వద్దకు వెళ్లి ఇద్దరి మరణాలకు కారణాలు అడిగారు. ఆ తాంత్రికుడు వారికి చేతబడి చేయడం వల్లే మరణించారని చెప్పాడు. దీంతో గ్రామంలో వారి ప్రత్యర్థులు చేసి ఉంటారనే అనుమానంతో ఒకరిని కొట్టి గ్రామం మధ్యలో నిర్బంధించారు. అప్పటి నుంచి విద్వేషాలు పెచ్చరిల్లాయి. గ్రామానికి చెందిన దాదాపు వంద కుటుంబాలు గ్రామం విడిచి పక్కనే ఉన్న కఠారివారిపాలెంకు వెళ్లి తలదాచుకున్నాయి. మే 24న మత్స్యకార గ్రామాలకు చెందిన పెద్దకాపులు వచ్చి ఇరువర్గాలకు సయోధ్య కుదిర్చి వారిని రామాపురం గ్రామానికి పంపించారు. వారం తిరక్కముందే చిన్న కారణంతో గ్రామంలో రెండు వర్గాలకు చెందిన వారు ఘర్షణకు దిగారు. ఘర్షణలో పోలీసులకూ గాయాలయ్యాయి. దీంతో పికెట్ ఏర్పాటు చేశారు.

చేపల వలల విషయంతో ఘర్షణలు..

ఏడాది కిందట ఓడరేవు మత్స్యకారులకు, వేటపాలెం మండలం రామాపురం, కఠారివారిపాలెం మత్స్యకారులకు చేపల వలల విషయంలో ఘర్షణలు జరిగాయి. ఓడరేవుకు చెందిన మత్స్యకారులు చిన్నచిన్న చేపలు పట్టే బల్లకట్టు వలలతో వేట సాగించేవారు. దీనిపై రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనేక మార్లు మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సముద్రంలో వేట సమయంలోనే ఓడరేవు, రామాపురం మత్స్యకారుల మధ్య ఘర్షణ జరిగింది. ఘర్షణలో రామాపురం మత్స్యకారులకు దెబ్బలు తగిలాయి. దీంతో రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు దాదాపు 200 మంది ఓడరేవు గ్రామంపై దాడి చేసి గ్రామానికి చెందిన కొందరిని కొట్టారు. దీనిపై అప్పటి ప్రకాశం జిల్లా కలెక్టర్, ఎస్పీ రెండు గ్రామాల పెద్దలకు రాజీ కుదిర్చారు.

సరుగుడు రగడ

పూర్వం నుంచి మత్స్యకారులు తమ గ్రామాల పరిధిలోని సముద్రతీర భూముల్లో సరుగుడు మొక్కలు నాటేవారు. అవి పెద్దవైన తరువాత వాటిని అమ్మి గ్రామంలో అందరూ సమానంగా పంచుకొనేవారు. కఠారివారిపాలెంకు చెందిన భూముల్లో రామాపురం వాసులు సరుగుడు మొక్కలు నాటడంపై గొడవ మొదలైంది. ఈ వివాదంపై మత్స్య, అటవీశాఖ అధికారులు రాజీ కుదిర్చారు. అయినా ఏడాదిలో పది నెలల పాటు ఈ గ్రామాల మధ్యన ఘర్షణలు, లేదా ఒకే గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో పోలీసులకు తలనొప్పిగా మారింది.

పెద్ద కాపులదే తుది తీర్పు..

బాపట్ల నుంచి నెల్లూరు వరకు సముద్రతీరంలోని 32 గ్రామాల్లో పెద్ద కాపులదే అంతిమ తీర్పుగా ఈ గ్రామాల ప్రజలు పాటిస్తుంటారు. ఆయా గ్రామాల్లో వచ్చే సమస్యలు, ఆ గ్రామ పెద్దల వల్ల కాని వ్యవహారాలను 32 గ్రామాలకు చెందిన పెద్ద కాపులు వచ్చి పరిష్కరిస్తుంటారు. అయితే పెద్ద కాపుల తీర్పులను ఉల్లంఘించి తరచూ ఘర్షణలు చోటు చేసుకోవడంతో పోలీసులకు సవాలుగా మారింది.

శివాలయంలో పుష్కర అష్ట బంధన మహా కుంభాభిషేకం

ఆలయానికి చేరుకున్న విశాఖ శ్రీ శారదా పీఠాధీశ్వరులు శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి స్వామి



పెదకాకాని: స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయంలో పుష్కర అష్టబంధన మహా కుంభాభిషేకం క్రతువు శైవాగమశాస్త్రోక్త సంప్రదాయ పద్ధతిలో ఘనంగా ప్రారంభమైంది. 12 సంవత్సరాలకు ఒకసారి చేసే ఈ మహా కుంభాభిషేకం విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామివార్ల పర్యవేక్షణలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి చేతుల మీదుగా గోపూజతో పూజలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ ఆగమిక నవులూరి సాయిబాబు దీక్షితులు ఆచార్యత్వంలో గురుపూజ, అంతరాలయ మూలగణపతికి విశేష స్నపన అర్చనలతో మొదలై యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అస్త్రరాజార్చనం, నీరాజనం, మంత్రపుష్పం, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వినియోగాలు నిర్వహించారు. స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య సరస్వతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రైతు భరోసా.. సాగు కులాసా

- అట్టహాసంగా రైతుభరోసా పెట్టుబడి సాయం జమ
- 1,82,854 మందికి ప్రయోజనం
- రూ.137.14 కోట్ల మేర లబ్ధి
- 2,828 మంది రైతులకు రూ.7.76 కోట్ల పంట నష్టపరిహారం జమ



రైతులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. వైఎస్సార్ రైతుభరోసా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నగదు పంపిణీ కార్యక్రమం గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కర్నూలు జిల్లా పత్తికొండలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో స్థానిక వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం నుంచి కలెక్టర్, ఎమ్మెల్యే కోన రఘుపతి, లబ్ధిదారులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ నమూనా చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ ప్రస్తుతం వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ ద్వారా జిల్లాలోని 1,82,854 మంది రైతులకు రూ.137.14 కోట్ల మేర ప్రయోజనం చేకూరినట్టు వివరించారు. ఇటీవల కురిసిన వర్షాలతో మొక్కజొన్న, వేరుశనగ, వరి పంటలకు నష్టం వాటిల్లిందని, అత్యంత వేగంగా నష్ట అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపడంతో కేవలం 15 రోజుల్లోనే ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన 2,828 మంది రైతులకు రూ.7.76 కోట్ల పరిహారం విడుదల చేసిందని పేర్కొన్నారు.

ఇది రైతు ప్రభుత్వం : కోన

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల సర్కారు అని ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. వర్షాలకు తడిసిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సిహెచ్. శ్రీధర్, వ్యవసాయ శాఖ జేడీ షేక్ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, ఆర్డీఓ జి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పెన్షన్ పంపిణీ

పల్నాడులో 66.46 శాతం



నరసరావుపేటలో వృద్ధాప్య పెన్షన్ అందిస్తున్న దృశ్యం

నరసరావుపేట రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుకను నెల మొదటి రోజు గురువారం జిల్లాలో 66.46 శాతం పంపిణీ చేశారు. తొలిరోజు 1,78,240 మందికి పెన్షన్ కానుక అందజేశారు. వలంటీర్ల తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి తలుపు తట్టి బయోమెట్రిక్ ద్వారా పెన్షన్‌ను పంపిణీ చేశారు.

గుంటూరు జిల్లాలో 71.06 శాతం



గుంటూరులో అవ్వకు పింఛన్ అందజేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుకను గుంటూరు జిల్లాలో లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి వలంటీర్లు అందజేశారు. వేలిముద్రలు, ఐరిస్ ఆధారంగా వలంటీర్లు ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేశారు. జిల్లాలో గురువారం 71.06 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,51,264 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.02 కోట్లు కేటాయించింది. గురువారం సాయంత్రానికి 1,78,540 మంది లబ్ధిదారులకు రూ.49.10 కోట్ల నగదు అందజేశారు.

గ్రూప్–1 పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు




గుంటూరు వెస్ట్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–1 పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ జి.రాజుమారి తెలిపారు. పరీక్షల ఏర్పాటుకు సంబంధించి గుంటూరు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 3వ తేదీ నుంచి 10 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనున్న పరీక్షలకు అభ్యర్థులు రెండు గంటల ముందుగానే హాజరు కావాలన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.వెయ్యి, గరిష్ట ధర రూ.1,500, మోడల్ ధర రూ.2,000 వరకు పలికింది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయంకు 1,350 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 810.00 అడుగుల వద్ద ఉంది.

నేడు ప్లస్ టూ పాఠశాలల్లో పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్లస్‌టూ పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు శుక్రవారం గుంటూరులోని డీఈఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.శైలజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, సివిక్స్, కామర్స్ సబ్జెక్టుల్లో ఉన్న పోస్టులకు అర్హత గల స్కూల్ అసిస్టెంట్లు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు రిజిస్టర్‌తో హాజరు కావాలని సూచించారు.

ఖో...ఖో క్రీడాకారుడు అట్ల శివనాగిరెడ్డికి ప్రభుత్వ సాయం

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా


శివనాగిరెడ్డిని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఈ ఏడాది మార్చిలో జరిగిన ఏషియన్ ఖోఖో ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో బాపట్ల జిల్లా నుంచి బంగారు పతకం సాధించిన అట్ల శివనాగిరెడ్డికి ప్రభుత్వ సాయం అందిస్తామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను అట్ల శివనాగిరెడ్డితో పాటు కోచ్ సీతారాంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. క్రీడాకారులకు ప్రభుత్వం అందించే సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోచ్ పాల్‌కుమార్ ఉన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

మాచర్లరూరల్: పొలం తగాదాలో అన్నని తమ్ముడు హత్య చేసిన సంఘటనలో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ షేక్ షమీముల్లా తెలిపారు. వెల్దుర్తి మండలం పట్లవీడు గ్రామానికి చెందిన అక్కెం వెంకయ్య (పిచ్చి వెంకయ్య), అక్కెం పకీరయ్యలకు పొలం భాగ పంపిణీలో విభేదాలు ఉన్నారు. గత నెల 28న ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న అక్కెం వెంకయ్య మెడపై పకీరయ్య గొడ్డలితో దాడి చేసి హత్య చేసి పారిపోయాడు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

మరింత నాణ్యంగా కిట్లు

- నాలుగో విడత పంపిణీకి సన్నాహాలు
- పర్యవేక్షిస్తున్న అధికార యంత్రాంగం


దుస్తులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రామారావు

బాపట్లఅర్బన్: కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే తల్లితండ్రులు తమ పిల్లలను బడులకు పంపాలంటే ఆర్థిక ఇబ్బందులతో గతంలో వెనకడుగు వేసేవారు. ఒకవేళ పంపిన ఆ తరువాత నోట్ పుస్తకాలు ఇతర సామగ్రి కొనుగోలుకు ఖర్చు భరించలేక చాలామంది డ్రాపౌట్స్‌గా మారేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. విద్యార్థులకు పుస్తకాలే కాదు జగనన్న విద్యా కానుక రూపంలో రూ.1,650 విలువైన సామగ్రి ఉచితంగా అందిస్తున్నారు. ఇప్పటికే మూడేళ్ల కిట్లు అందజేసిన ప్రభుత్వం నాలుగోసారి ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తుంది.

పేద విద్యార్థులకు జగన్ మామయ్య సాయం

ఒకటి నుంచి పదో తరగతుల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు ఉచితంగా రూ.1,650 విలువైన సామగ్రి, వరుసగా నాలుగో ఏడాది ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రభుత్వ విద్యకు ఏనలేని ప్రాధాన్యత ఇచ్చారు. నాడు-నేడు కార్యక్రమంతో ప్రతి ప్రభుత్వ పాఠశాలకు లక్షలాది రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యబోధన సౌకర్యాలు కల్పిస్తున్నారు. తల్లిదండ్రులపై పైసా భారం పడకుండా తొమ్మిది రకాల వస్తువులతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లను 1-10 తరగతుల విద్యార్థులకు అందజేస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్, విక్టోరియల్ డిక్షనరీలు, బ్యాగు, మూడు జతల యూనిఫాం, షూ, బెల్ట్ కిట్‌లో ఉంటాయి. ఇప్పటికీ మూడేళ్ల కిట్లను ఇచ్చారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగో విడత కిట్లను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో 1-10 తరగతుల విద్యార్థులు 1,11,027 మంది ఉన్నారు. వీరి కోసం రూ.21.80 కోట్లు ఖర్చు చేసే కిట్లు అందజేస్తున్నారు.

మూడేళ్లలో జగనన్న విద్యా కానుక ఖర్చు ఇలా..

సం..	విద్యార్థులు	ఖర్చు (కోట్లలో)
2020-21	1,25,723	రూ.16.97
2021-22	1,30,626	రూ.21.77
2022-23	1,14,977	రూ.22.94
2023-24	1,11,022	రూ.22.15

మారిన యూనిఫాం రంగు

విద్యార్థుల యూనిఫామ్ ఈసారి రంగు మారింది. గతంలో బాలికలకు పింకు, బ్లూ కాంబినేషన్, బాలురకు లైట్ స్కై థింక్ బ్లూ కాంబినేషన్ లో యూనిఫామ్ ఇచ్చేవారు. గతంలో ప్లెయిన్‌లో ఉండే యూనిఫామ్ ఈసారి బాలికలకు మాత్రం చెక్స్ కలిగినవి ఇస్తున్నారు. వెనకవైపు నేవీ బ్లూ కలర్ ఉండేది ఈసారి యూనిఫామ్ బ్యాగులు రంగులు మారాయి .

దేశంలో ఎక్కడా లేదు



ప్రభుత్వ పాఠశాలల పిల్లల యూనిఫాం, షూ క్వాలిటీని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించి ఇవ్వడం అనేది దేశంలో ఎక్కడా లేదు. కార్పొరేట్ తరహా డ్రెస్ కోడ్‌తో తమ పిల్లలు పాఠశాలలకు వెళుతున్నారని ఆనందం తల్లిదండ్రుల్లో ఉంది. జగనన్న విద్యా కిట్లు చాలా నాణ్యతగా ఉంటున్నాయి. ప్రభుత్వం పిల్లల చదువు విషయంలో రాజీ లేకుండా కృషి చేస్తుంది.

– సీహెచ్.రజిని, జీఎంఓ, బాపట్ల

ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- సెలవులు ముగిసేంత వరకు పిల్లల కదలికలపై జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవి సరదా....కాకూడదు విషాదం పేరుతో విడుదల చేసిన పోస్టర్

బాపట్లటౌన్: సరదా కోసం ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జిందాల్ గురువారం విలేకరులతో మాట్లాడారు. పిల్లలు ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావున పిల్లలు, యువకులు సరదాగా కాలువలు, బావులు, చెరువులు, సముద్ర తీరానికి వెళ్తున్నారని, కాలువలు, బావులు, చెరువుల్లో ఈతకు దిగినప్పుడు, సముద్రంలో మునిగేటప్పుడు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు. రాష్ట్రంలో సరాసరి సంవత్సరానికి 1500 మంది ఈత సరదాకు బలవుతున్నారన్నారు. పిల్లల కదలికలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. వారు స్నేహితులతో ఎక్కడికి వెళుతున్నారనే విషయం తెలుసుకోవాలన్నారు. పిల్లలు ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నారులకు ఈత రాకపోతే కలిగే ప్రమాదాల గురించి వివరించాలన్నారు. తల్లిదండ్రులే స్వయంగా వారి పిల్లలను వెంటబెట్టుకుని వెళ్లి దగ్గరుండి ఈత నేర్పించాలన్నారు. ఈత రానివారు స్నేహితులతో బావులు, కాలువలు, చెరువులు, కుంటలలో ఈతకు వెళితే వాటి లోతు తెలియని కారణంగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. బావులు, కాలువలు, చెరువులు, కుంటలలో ఈత కొట్టేముందు ఈత వచ్చిన వారు సైతం వాటి లోతు ఎంత అనే విషయం కర్రల సాయంతో చూసుకోవాలన్నారు. సముద్ర తీర ప్రాంతాలకు విహార యాత్రలకు వెళ్లిన సమయంలో ఎక్కువ లోతులోకి వెళ్లకుండా పోలీసులు సూచించిన నిర్దిష్ట లోతులోనే మునగాలన్నారు. మద్యం మత్తులో నీటిలోకి దిగే ప్రయత్నం చేయటం మంచిది కాదన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో చెరువులు, నీటి కుంటల వద్దకు ఈతకు వెళ్లకుండా పోలీసులు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సముద్ర తీరాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. లోతును తెలిపే విధంగా కర్రలను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారులు ఈతకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తెలియజేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసులను ఆదేశించారు.

ఉత్తమ నాటకం 'ది ఇంపోస్టర్స్'

- ఉత్తమ నటుడుగా శశిధర్
- ఉత్తమ నటిగా అనూషా
- ముగిసిన అఖిల భారత ఆహ్వాన నాటక పోటీలు


ది ఇంపోస్టర్స్ నాటకంలోని ఓ సన్నివేశం

పల్లెకోన(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పల్లెకోనలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న డాక్టర్ డి.రామానాయుడు అఖిల భారత ఆహ్వాన నాటక పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. విజేతలకు నిర్వాహకులు, సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు. ఉత్తమ ప్రదర్శనగా మిత్రా క్రియేషన్స్ నరసరావుపేట వారి ది ఇంపోస్టర్స్ (అంతా నిజమే చెబుతారు) నిలిచింది. ఈ నాటకానికి 6 బహుమతులు దక్కాయి. ఈ నాటకంలో ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్ భూషణరావు పాత్రధారుడు సుబ్బారావుకు, ఉత్తమ నటిగా అలకానంద పాత్రధారిణి అనూషాకు, ఉత్తమ రచనగా ఆకురాతి భాస్కరచంద్ర, ఉత్తమ దర్శకత్వం కింద ఎస్ఎం బాషాకు, ప్రత్యేక బహుమతి కింద దియా పాత్రధారిణి పూజా ఠాగూర్‌కు బహుమతులు వరించాయి. కలనేత నాటకానికి నాలుగు బహుమతులు వరించాయి. ఉత్తమ ద్వితీయ నటుడిగా వైకుంఠం పాత్రధారుడు గోవర్ధనరెడ్డికి, ప్రత్యేక బహుమతిగా రజిత పాత్రధారిణి ఉషశ్రీకి, ఉత్తమ క్యారెక్టర్ నటిగా యాదమ్మ పాత్రధారిణి పద్మప్రియకు, ఉత్తమ రంగాలంకరణ కింద సురభి ఉమాశంకర్, గోపీ కృష్ణ, నాగరాజున్, జయవర్ధన్‌లు అందుకున్నారు. సిరిమింగిన వెలగ పండు నాటకానికి మూడు బహుమతులు దక్కాయి. ఉత్తమ ప్రతినాయకుడిగా ప్రకాష్ పాత్రధారుడు ఏవీ రమణమూర్తికి, ఉత్తమ నటుడిగా చర్చిక పాత్రధారుడు డి.శశిధర్‌కు, ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా ఈ నాటకం ఎంపికైంది. అదే విధంగా ఇంద్రప్రస్థం నాటకానికి మూడు బహుమతులు లభించాయి. ఉత్తమ సహాయ నటుడిగా సందీప్ పాత్రధారుడు జి.అప్పన్నబాబు, ఉత్తమ సహాయ నటిగా సౌందర్య పాత్రధారిణి కుసుమసాయి, ఉత్తమ సంగీతం కింద పి.లీలామోహన్‌కు లభించాయి. ఉత్తమ ఆహార్యం, ఉత్తమ లైటింగ్ కింద ఎర్రకలువ నాటకానికి బహుమతులు దక్కాయి. ఉత్తమ హాస్య నటుడిగా సవారీ నాటకంలో సీతారామ్ పాత్రధారుడు జి.అప్పన్నబాబుకి బహుమతి దక్కింది. ఈ నాటక పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వైఎస్‌కేఎస్.స్వామి, డీఎస్ఎన్ మూర్తి, సీహెచ్‌కె ప్రసాద్‌లు వ్యవహరించారు. కార్యక్రమాలను ట్రస్ట్ నిర్వాహకుడు సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించగా కార్యక్రమంలో నాటకోత్సవ సమన్వయకర్త డి.రామకోటేశ్వరరావు, మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి వీవీ రాజగోపాల్, పరుచూరి వెంకటేశ్వరరావు కుమార్తె పద్మావతి, వేజండ్ల బసవపున్నారావు, మండవ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

మెప్మాలో అవినీతి గద్దలు

- ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య లంచావతారులు
- డ్వాక్రా మహిళల వద్ద అక్రమ వసూళ్లు
- ఆర్పీలు, సీవోల ద్వారా అవినీతి దందా
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అక్కాచెల్లెమ్మలు
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

బాపట్ల అర్బన్: ఆ డబ్బులు మీ ఖాతాల్లోకి రావాలంటే నా ఖాతా సెటిల్ చేయండంటూ మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఒత్తిడి చేస్తున్నారు. ఇటు ఆర్పీలను, సీవోలను మధ్యవర్తులుగా ఉంచి అవినీతి భాగోతం నడుపుతున్నారు. పాదయాత్ర సమయంలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానని, సున్నా వడ్డీ అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం.. అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణాలను తిరిగి చెల్లిస్తున్నారు. అదే సమయంలో సున్నా వడ్డీ రుణాలను మహిళల ఖాతాల్లో నేరుగా వేస్తున్నారు. ప్రభుత్వం అందించే ప్రతి రూపాయి ప్రజలకు నేరుగా అందాలనే లక్ష్యంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు చేస్తుంటే.. మెప్మా అధికారులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య గద్దలుగా మారుతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి రూపాయి ప్రజలకు చేరువ కాకుండా తన్నుకుపోతున్నారు. దీనిపై డ్వాక్రా మహిళలు ప్రశ్నిస్తే వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు.


ఆర్పీలు, సీవోలు పాత్రదారులు

డ్వాక్రా సంఘాలకు సంబంధించిన లావాదేవీలు, తీర్మానాలు, సమావేశాలన్నీ ఆర్పీలు, సీవోలు చూస్తుంటారు. వీరు తీర్మానాలు రాసినందుకు ఒక రేటు.. బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించినందుకు మరో రేటు పెట్టి మహిళల వద్ద దండుకుంటున్నారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న మహిళలు ..వాటిని ప్రతి నెలా వాయిదాల రూపంలో చెల్లిస్తారు. దీనికిగాను తీర్మానాలు రాసేందుకు కూడా లంచాలు వసూలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలను ప్రతి ఏటా అమలు చేస్తుంది. ఈ పథకాలు వస్తే చాలు మెప్మా అధికారులు పండుగ చేసుకుంటున్నారు. ప్రతి గ్రూపు నుంచి సుమారు రూ.10 వేలకుపైగా వసూలు చేస్తున్నారు. బాపట్ల పట్టణంలో1750 గ్రూపులు ఉన్నాయి. ఈ లెక్కన ఒక్కో పథకాన్ని లక్షల్లో ముడుపులు లాగేసుకుంటున్నారు.

సిటీ మిషన్ మేనేజర్ సూత్రధారి

బాపట్ల మెప్మా లీలలు అన్నీ ఇన్నీ కావు. ఇక్కడ సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) ను ప్రసన్నం చేసుకుంటే చాలు ..ఇష్టారాజ్యంగా ఉద్యోగం చేయొచ్చు. ఏడాది కిందట బాపట్ల పట్టణంలోని దేవుని మాన్యం ప్రాంతానికి చెందిన ఓ ఆర్పీ డ్వాక్రా సంఘాల డబ్బులు సుమారు రూ.2.50 లక్షలు వరకు వసూలు చేసుకుని సొంతానికి వాడేసుకున్నారు. విషయం తెలిసి సంబంధిత సంఘాల డ్వాక్రా మహిళలు లబోదిబోమన్నారు. సదరు ఆర్పీకి సిటీ మిషన్ మేనేజర్ అండదండలు ఉండడంతో అక్రమంగా వాడుకున్న డబ్బులు ఇప్పటి వరకు రికవరీ చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు ఆర్పీలు, సీవోలు వసూలు చేసిన లంచాల వెనుక సిటీ మిషన్ మేనేజర్ ప్రధాన పాత్రధారి అని డ్వాక్రా సంఘాల మహిళలు అంటున్నారు. ఇప్పటికై నా పేదలను దోచుకుంటూ, ప్రభుత్వానికి అప్రతిష్ట తీసుకొస్తున్న మెప్మా అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


లోన్ సొమ్ము వాడుకుంది



మాది బాపట్ల పట్టణం దేవుడు మన్యం. మరియమ్మ తల్లి గ్రూప్. ఆర్పీ సరోజినీ తన సొంత అవసరాల కోసం రూ.2.50 లక్షలు లోన్ డబ్బులను వాడుకుంది. ఆ డబ్బులను కట్టమంటే బ్యాంకుకి కట్టడం లేదు. సంవత్సరం కాలం అయింది బ్యాంకు నుంచి మాకు నోటీసులు వస్తున్నాయి. దీని మీద మెప్మా అధికారి నాయక్‌కి దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి చర్య తీసుకోలేదు.

– మల్లాల కోటేశ్వరమ్మ, మరియమ్మ తల్లి గ్రూప్ సభ్యురాలు. బాపట్ల

అవినీతిని సహించం



వైఎస్సార్ ఆసరాకు సంబంధించి డ్వాక్రా మహిళల వద్ద అక్రమంగా డబ్బులు తీసుకుంటున్నట్లు మా దృష్టికి రాలేదు. ఇలాంటి అవినీతిని ఎట్టి పరిస్థితుల్లో సహించం. మెప్మాలో అధికారులు లంచాల కోసం డిమాండ్ చేస్తే నేరుగా నన్ను సంప్రదించవచ్చు.

– పి.వెంకటనారాయణ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బాపట్ల జిల్లా

బందో'మస్తు'గా ఉండాలి

ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశం

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నగర పర్యటన దృష్ట్యా బి.డి బృందాలు, విధులు నిర్వహించే అధికార, సిబ్బంది ప్రతి ఒక్కరిని కూలంకుషంగా తనిఖీలు చేశాక లోనికి అనుమతించాలని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. సీఎం బందోబస్త్ పర్యటన దృష్ట్యా గురువారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బందితో బ్రీఫింగ్ నిర్వహించారు. అనంతరం చుట్టుగుంట కూడలిలో జరగనున్న సభా వేదిక వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పలు అంశాలపై పోలీసులకు దిశానిర్దేశం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సీఎం బందోబస్తు ఏర్పాట్లను సెక్టార్స్ ప్రకారం కేటాయించామన్నారు. సెక్టార్ల పరిధిలో విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, కాన్వాయి పార్టీ, రోప్ పార్టీలు సమర్థంగా విధులు నిర్వహించాలని చెప్పారు. ఇక రూఫ్ టాప్‌లలో వారు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సీఎం పర్యటించే ప్రాంతాలలో ట్రాఫిక్, వాహనాల నిలుపుదల (పార్కింగ్) ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఏదైనా సమస్య వాటిల్లితే క్షణాల్లో పోలీస్ అధికారులదృష్టికి తేవాలని సూచించారు. విధులు పట్ల ఎవరూ అలసత్వం వహించవద్దన్నారు. ఎవరైనా గైర్హాజరైతే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్పీలు ఎస్.షేక్(గుంటూరు తూర్పు), కె.సుప్రజ (పరిపాలన), కె.శ్రీనివాసరావు(ఎల్/ఓ), శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు(ఏఆర్), డీఎస్పీలు పోతురాజు (తుళ్లూరు), బాలసుందరరావు (ట్రాఫిక్), సుభాష్(ఎస్‌బీ), ఉమా మహేశ్వర రెడ్డి (పశ్చిమ), జనార్ధన్‌రావు (తెనాలి), కేసీహెచ్.రామారావు (దిశ), శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ) ఉన్నారు.